# కాంగ్రెస్‌కెంత సమయమిస్తారో మాకూ అంతే ఇవ్వాలి: బాబు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అవిశ్వాస తీర్మానంపై చర్చకు ప్రభుత్వం సమాధానం ఇచ్చేందుకు ఎంత సమయం కేటాయిస్తారో తమకూ అంతే ఇవ్వాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం సభలో మాట్లాడుతూ.. సభా వ్యవహారాల సంఘంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. తెదేపా సభ్యులు 5గంటలు మాత్రమే మాట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పక్షాన ఆరు గంటలు మాట్లాడారని, మళ్లీ ప్రభుత్వ పక్షాన మంత్రులు గంటల కొద్దీ ప్రసంగించడం పద్ధతి కాదని అన్నారు. పాలక పక్షానికి ఎంత సమయం కేటాయిస్తారో తమకూ అంతే ఇవ్వాలని కోరారు. సభావ్యవహారాల మంత్రి రోశయ్య అభ్యంతరం వ్యక్తంచేశారు. దేశంలో ఎక్కడా అవిశ్వాస తీర్మానంపై చర్చలో ఇలాంటి సంప్రదాయం లేదన్నారు. తెదేపా ఆరోపణలపై మంత్రులు ప్రభుత్వ వాదనలను వినిపిస్తున్నారని తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై చర్చలో ప్రతిపక్ష నేత చెబుతున్న విధానం ఎక్కడా అనుసరించరని ముఖ్యమంత్రి చెప్పారు. తాను ఎంత సేపు మాట్లాడితే అంత సమయం ప్రతిపక్ష నేతకు ఇవ్వడానికి అభ్యంతరం లేదన్నారు. దీనిపై సభాపతి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఒకటిన్నర గంట తీసుకోవాలని సురేశ్‌రెడ్డి చేసిన సూచించారు. దీనికి చంద్రబాబు అంగీకరించలేదు. చివరకు సభానాయకుడు ఎంత సమయం మాట్లాడితే అంత సమయం ఇవ్వడానికి అంగీకరించారు.